# పర్యావరణ హితంగా వేడుకలు జరగాలి

○ హైడ్రా కమిషనర్ రంగనాథ్



**విశ్వంభర, హైదరాబాద్ :** వేడుక ఏదైనా పర్యావరణ హితంగా ఉండాలి అని పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా మారాలి అని గణేష్ ఉత్సవాలతోనే ఇది ప్రారంభం కావాలి అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఇప్పుడు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడాలి. నగరంలో చెరువులన్నీ కాలుష్య రహితంగా మారాలి. ఆక్రమణలను తొలగించి చెరువులను హైడ్రా విస్తరిస్తోంది. మురికి కూపాలుగా ఉన్న చెరువులలో పూడికను మొత్తం తొలగించి మంచి నీటి సరస్సులుగా మార్చేందుకు హైడ్రా గట్టి ప్రయత్నం చేస్తోంది. మురుగు నీరు కలవకుండా ప్రతి చెరువు వద్ద ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను కూడా ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో చెరువులు కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. గణేష్ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకునే ప్రతి చెరువు వద్ద బేబీ పాండ్‌లను నిర్మిస్తున్నాం. ఇలాంటి తరుణంలో నగర ప్రజలు కూడా పర్యావరణ హితమైన గణేష్ విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలి`` అని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలిగే నష్టాలను.. మట్టి విగ్రహాలతో కలిగే లాభాలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను హైడ్రా కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఒక్క రూపాయికే మట్టి విగ్రహాలను అందిస్తున్నామని ఈ సందర్భంగా లైఫ్ సేవర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి శివ నేత తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపి శంకర్ , విజయభాస్కర్ , అనుశ్రీ , శ్రీనివాస్, అనిల్‌కుమార్, అను పులెపాక, నేతలు పాల్గొన్నారు.



## విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### - మాజీ అధ్యక్షులు సిద్దు ముదిరాజ్

**విశ్వంభర, సరూర్ నగర్ :** 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ఆగం చేస్తూ, రూ. 15,000 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సరూర్ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు సిద్దు ముదిరాజ్ పేర్కొన్నారు.ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఫీజుల బకాయి బిజెపి లడాయి' పేరుతో తెలంగాణ బిజెపి నేత శ్రీ ఎన్. రామచందర్ రావు చేపట్టిన 2 రోజుల నిరాహార దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా మద్దతుగా రంగారెడ్డి జిల్లా మహేశ్వర నియోజకవర్గం సిద్దు ముదిరాజ్ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులుతో కలిసి రాష్ట్ర కార్యాలయం లో రాంచందర్ రావు కు మద్దతుగా నిరాహార దీక్ష లో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా సిద్దు ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం ఇకనైనా ఆపాలి అని , ఫీజు రి ఇంబర్స్ మెంట్ నిధులు కాంగ్రెస్ సర్కార్ తక్షణమే విడుదల చేయాలి అని డిమాండ్ చేసారు. నిధులు విడుదల చేసే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాణాల ప్రవీణ్ కుమార్,ఆరుట్ల సురేష్ కుమార్, బెంగర బోయిన సురేష్, జంగయ్య ముదిరాజ్ , కిరణ్ రాజ్ , ప్రేమ్ యాదవ్, విజయ్ కృష్ణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పలారం బండి ఊరేగింపు



**విశ్వంభర, కొత్తపేట :** ఎల్బీనగర్ నియోజకర్గ పరిధిలోని మోహన్ నగర్‌లో చిట్టా రమ్మ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇలాంటి ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పలరం బండి కార్యక్రమంలో కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మేకల సత్యనారాయణ, యువ నాయకులు, కాలనీ వాసులు, కాలనీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో పోచమ్మ బోనాలకు ఏర్పాట్లు



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 12వ వార్డు బృందావన్ నగర్ కాలనీలో ఈ నెల 30వ తేదీ ఆదివారం జరగబోయే పోచమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ కొండగారి త్రిలోక్ కుమార్ ముందస్తు చర్యలు చేపట్టారు. కాలనీలో గుంతలుగా ఉన్న రోడ్లకు మట్టి పోయించి రోడ్డును పునరుద్ధరించడం జరిగింది. భక్తులకు, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఈ మరమ్మత్తు పనులు చేయించారని స్థానికులు తెలిపారు. బోనాలకు వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా రోడ్లు సరిచేయడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన భానుచందర్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** ఎస్పీ నంద్యాల నరసింహా రెడ్డి చామల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బానుచందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నరసింహా రెడ్డి ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని ఆయన అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు పోలీసు అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, భద్రత, ప్రజా సంక్షేమం కోసం పోలీసు శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**విశ్వంభర, సూర్యాపేట :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం మోతే మండలం లోని రాంపురం తండాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో కలెక్టర్, ఎస్పీ పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలను పెంచడం వలన అవి మన భావితరాలకు కావలసిన ఫలాలను అందిస్తాయని అన్నారు . అనంతరం మామిళ్లగూడెం హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల గురించి, పిల్లల భోజనం, పిల్లలు హాజరు శాతం గురించి కలెక్టర్ హెడ్మాస్టర్ ని అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో రాంపురం సర్పంచ్ బానోతు సత్తెమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్ రెడ్డి, తాసిల్దార్ వెంకన్న, ఎంపీడీవో సందీప్ కుమార్, హెడ్మాస్టర్ నళిని, ఎంపీఓ వంశీకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పై హత్యాయత్నం?

### ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణ



**విశ్వంభర, ఎల్బీనగర్ :** హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణపై మంగళవారం హత్యాయత్నం జరిగింది. తాను ఇంటి ముందు రెక్కీ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్యాయత్నం వెలుగులోకి వచ్చింది. అనంతరం పట్టుబడిన వ్యక్తిని ఎల్బీనగర్ పోలీసులు అప్పజెప్పారు. ఈ మేరకు ఎల్బీనగర్ పోలీసులకు తనకు రక్షణ కల్పించాలని, తనపై హత్యకు కుట్ర చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మీడియాతో ఆయన మాట్లాడారు. మన్సూరాబాద్ డివిజన్ సరస్వతి నగర్ లో తాను రేషన్ షాపు నిర్వహిస్తున్నానని తెలిపారు. మంగళవారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు గంట సమయం పాటు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. గమనించిన తాను స్థానికుల సహాయంతో వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా ఒకరు పట్టుబడ్డగా మరొకరు పరారయ్యారు. పట్టుబడిన వ్యక్తిని పోలీసుల సమక్షంలో విచారించగా తనను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పంపించాడని చెప్పినట్లు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా నాకు శివచరణ్ రెడ్డి తండ్రి ప్రభాకర్ రెడ్డి మధ్యన వివాదం నడుస్తుందని ఇందులో భాగంగా నేను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభాకర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రభాకర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. కాగా, తనపై హత్యాయత్నానికి కుట్ర పన్నిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, అతడి తండ్రి ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తనకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

## సీఎం పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే: జగ్గారెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల స్వేచ్ఛ బందీ అయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛతో పాటు తమ డిమాండ్ల కోసం ధర్నాలు చేసుకునే అవకాశం కల్పించిందనిటీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఇందిరాపార్క్‌లో ప్రజలు తమ సమస్యలపై ధర్నాలు చేసుకునే స్వేచ్ఛను కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రస్తావిస్తూ ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులకు స్మార్ట్ కార్డుల వంటి కార్యక్రమాలు చేపట్టామని జగ్గారెడ్డి తెలిపారు. రుణమాఫీలో 90 శాతం పూర్తయిందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు బయలుదేరిన సమయంలో కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని జగ్గారెడ్డి ఆరోపించారు. సీఎం పర్యటన విజయవంతం కాకుండా అడ్డుకునే ప్రయత్నం జరిగిందని అన్నారు. లండన్ నుంచి సీఎం తిరిగి రావాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు."తెలంగాణ ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాబట్టే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయన పర్యటనను అడ్డుకుంది. సీఎం పర్యటనను అడ్డుకోవడం అంటే తెలంగాణ ప్రజలను అవమానించినట్టే" అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.అమెరికాకు వెళ్లడం రేవంత్‌రెడ్డికి కొత్తేమీ కాదని, అసలు ఆయన పర్యటనను ఎందుకు అడ్డుకోవాల్సి వచ్చిందో కేంద్రం స్పష్టం చేయాలని అన్నారు. ఈ అంశంపై తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, మేధావులు ఆలోచించాలని కోరారు.రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను జగ్గారెడ్డి తప్పుబట్టారు. రేవంత్‌రెడ్డి దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తిని కలవడానికి వెళ్తున్నారని ఈటల రాజేందర్ ఆరోపించారని, అయితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గతంలో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన విషయాన్ని బీజేపీ నేతలు గుర్తు చేసుకోవాలని అన్నారు.ప్రధాని స్థాయి వ్యక్తికి భద్రత, ప్రోటోకాల్ అత్యంత కట్టుదిట్టంగా ఉంటుందని పేర్కొన్న జగ్గారెడ్డి, అలాంటి పరిస్థితుల్లో మోదీ పాకిస్థాన్‌కు ఎలా వెళ్లారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "మోదీ పాకిస్థాన్‌కు ఎందుకు వెళ్లారో చెప్పిన తర్వాతే రేవంత్‌రెడ్డి పర్యటన గురించి మాట్లాడాలి" అని అన్నారు.అమెరికా పర్యటనకు సంబంధించిన విషయాలు అక్కడి భారత రాయబార కార్యాలయానికి, సంబంధిత అధికారులకు తెలిసే ఉంటాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం వివరించాలని కోరారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని జగ్గారెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ నాయకత్వంలో పనిచేయాలనే తపనతో ఉన్నారని, ఆయన కాంగ్రెస్ పార్టీ పట్ల పూర్తి కమిట్మెంట్‌తో ఉన్నారని అన్నారు.ప్రధాని మోదీ ఎందుకు అలా మాట్లాడారో తనకు తెలియదని పేర్కొన్న జగ్గారెడ్డి, రేవంత్‌రెడ్డి మాత్రం న్యూట్రల్‌గా, బ్యాలెన్స్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు."రాహుల్‌గాంధీ పట్ల రేవంత్‌రెడ్డికి పూర్తి కమిట్మెంట్ ఉంది. ఎవరూ ఎక్కువగా ఊహించుకోవాల్సిన అవసరం లేదు. అవతలి వ్యక్తి ప్రేమిస్తే ఎవరు ఏం చేస్తారు? అది వన్‌సైడ్ లవ్ మాత్రమే" అంటూ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.



సంగారెడ్డి జిల్లా కందిలోని ఎల్ఎన్ కన్వెన్షన్లో జరిగిన ఎర్రం రాములమ్మ, లక్ష్మినారాయణ దంపతుల కుమార్తె హరిప్రియ -మల్లిఖార్జున గుప్త వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రికల చైర్మన్ డా.కాచం సత్యనారాయణ గుప్త.



## ఘనంగా బీపీ మండల్ 108 వ జయంతి

**విశ్వంభర, హైదరాబాద్ :** బీపీ మండల్ 108వ జయంతి సందర్భంగా బీసీ భవన్ హిమాయత్ నగర్ లో మండల్ మహనీయుడికి నివాళులు అర్పిస్తున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, బీపీ మండల్ గారి కృషి వల్లనే బీసీలకు 27% రిజర్వేషన్లు దక్కాయని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ నగిరి ప్రవీణ్ కుమార్,పొలాగోని వెంకీ గౌడ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు, రాజేష్ పాల్గొన్నారు.



శిల్పారామంలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ల సమావేశంలో స్కూల్ లైబ్రరీస్ ను బలోపేతం చేయాలని మరో గ్రంథాలయ ఉద్య మం కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎఎస్పీడీ శ్రీహరి , ఓపెన్ స్కూల్ డైరెక్టర్ లింగయ్య , ఆర్జేడీ మధన్ మోహన్ , ఎస్ ఏ ఎం ఓ.. అర్జున్మరియు ఎస్ సి ఆర్ టి స్టాఫ్ పాల్గొన్నారు.



సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి భౌతిక కాయానికి ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ రాయబండి పాండురంగం, వనరుల పరిరక్షణ కమిటీ చైర్మన్ గోర శ్యాంసుందర్ తదితరులు నివాళులర్పించారు.

(విశ్వంభర, సరూర్ నగర్)




## ఎస్ఐఆర్‌ఫేజ్ 2 బీఎల్ఏ శిక్షణ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

**విశ్వంభర, మహేశ్వరం :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో వై ఏ ఆర్ కన్వెన్షన్ హాల్ మల్లాపూర్ లో మహేశ్వరం నియోజకవర్గం ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇంటెన్సు రివిజన్ పేజ్ 2 బి ఎల్ ఏ బూతు లెవెల్ శిక్షణ కార్యక్రమం లో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బి ఎల్ ఏ లు మహేశ్వరం శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, తుమ్మలూరు ఉప సర్పంచ్ సంగారెడ్డి, శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ పోతర్ల తిరుపతయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య , కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, ప్రశాంత్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మహమ్మద్ సాబీర్, మహేశ్వరం బి ఎల్ ఏలు కాకి మల్లేష్ , ఏపూరి నరసింహ, అల్లే రాకేష్, తిరుమల సుధాకర్, పెంద్యాల గ్రామ బి ఎల్ ఏ బాలకృష్ణ, నందు పల్లి గ్రామ బి ఎల్ ఏ మొహమ్మద్ షరీఫ్, వివిధ గ్రామాల బిఎల్ఏలు నాయకులు పాల్గొన్నారు.

## సీఈసీ ఆధ్వర్యంలో మూక్స్ లపై ఆన్‌లైన్ వర్క్‌షాప్




**విశ్వంభర, హైదరాబాద్ :** బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ (సీఈసి) న్యూఢిల్లీ ఆధ్వర్యంలో విద్యావేత్తల కోసం మూక్స్ అవగాహనపై ఆన్‌లైన్ వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. సీఈసి 2026 అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా జరిగిన ఈ వర్క్‌షాప్‌కు 75 మంది అధ్యాపకులు, కోర్సు కోఆర్డినేటర్లు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మావతి ప్రారంభోపన్యాసం చేస్తూ, విద్యార్థులకు అదనపు క్రెడిట్లు సాధించడంలో మూక్స్ ల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ సీఈసి ఈఎమ్ఆర్ సి డైరెక్టర్ డా. పి. రఘుపతి మాట్లాడుతూ, 2026 జూలైడిసెంబర్ సెషన్‌కు రూపొందించిన 172 సీఈసి మూక్స్ గురించి, వాటి నిర్మాణం, క్రెడిట్ విధానం, కోఆర్డినేటర్ల బాధ్యతలపై వివరించారు. కళాశాల భూగోళశాస్త్ర విభాగాధిపతి డా. విఘ్నేశ్వర్ మేఖా స్వయం కోర్సు కోఆర్డినేటర్‌గా మారే విధానం, అధ్యాపకులకు సిఏఎస్ ప్రమోషన్లలో మూక్స్ ల ప్రాముఖ్యతను తెలిపారు. చివరగా ఇకక్ ఐక్యూఏసి(ఇంటర్నల్ క్వాలిటీ అస్సెస్మెంట్ కౌన్సిల్ ) కోఆర్డినేటర్ డా. అన్నీ షెరాన్ మాట్లాడుతూ, డిజిటల్ బోధన, జీవితకాల అభ్యాసంలో స్వయం మూక్స్ ల పాత్రను నొక్కిచెప్పారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108